క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దేవరాపల్లి : దేవరాపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని తారువ ఫీడర్‌లో శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు స్థానిక ఎలక్ట్రికల్ ఏఈ కె. శంకరరావు తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని, దీంతో తెనుగుపూడి, గరిశింగి, వెంకటరాజుపురం గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

కె.కోటపాడు : వారాడ సబ్ స్టేషన్ పరిధిలో గల గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ ఎం .చంద్రశేఖర్ తెలిపారు. వారాడ సబ్ స్టేషన్‌లో మరమ్మతు పనుల నిమిత్తం వారాడ, ఆర్.వై.అగ్రహారం. ఆనందపురం, కొరువాడ, పిండ్రంగి, కె.జె.పురం, గవరపాలెం, వి.సంతపాలెం గ్రామాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

25లోగా దరఖాస్తు చేసుకోవాలి

మాకవరపాలెం: అన్నదాత-సుఖీభవ పథకానికి ఈ నెల 25 లోపు దరఖాస్తులు చేసుకోవాలని ఏవో చిరంజీవి తెలిపారు. ఆయన గురువారం మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు సుమారు 8 వేల మంది రైతులు దరఖాస్తులు చేసుకున్నారన్నారు. మిగిలిన వారుంటే ఈ నెల 25 లోగా సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో ఆధార్, భూమి ఆన్‌లైన్ పత్రాలతో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

వేతనాలందక వైద్యశాఖ ఒప్పంద ఉద్యోగుల ఇక్కట్లు

రోలుగుంట: వైద్యశాఖలో విధులు నిర్వహిస్తున్న ఒప్పంద కార్మికులకు వేతనాలందక ఇక్కట్లు పడుతున్నారు. మూడు నెలలుగా జీతాలు లేక పోషణ భారంగా మారిందని వారి కుటంబసభ్యులు వాపోతున్నారు. విధుల నిర్వహణకు సంబంధించి తమతో బాండ్ల పేపర్లలో తమ అంగీకార ధ్రువీరణను తీసుకొని మాకు జీతాలు ఇవ్వకుండా ఇక్కట్లకు గురి చేయడం తగదని పేర్కొన్నారు. పాలక పక్షం స్పందించి జీతాలు మంజూరు చేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

ఆకట్టుకున్న యోగాసనాలు



యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు, సచివాలయ సిబ్బంది

నర్సీపట్నం: అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని మున్సిపాలిటీ శారదనగర్‌లో గురువారం కర్టెన్ రైజర్ యోగా సెషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్పీకర్ సతీమణి, కౌన్సిలర్ పద్మావతి హాజరయ్యారు. ఆరోగ్యవంతంగా ఉండేందుకు యోగా ఉపయోగపడుతుందన్నారు. ప్రతి ఒక్కరు యోగాకు కొంత సమయం కేటాయించాలన్నారు. అనంతరం యోగా శిక్షకులు యోగాసనాలు ప్రదర్శించారు. విద్యార్థులు, సచివాలయాల సిబ్బంది యోగలో పాల్గొన్నారు.

పూర్తి కానున్న వరి కోతలు... కానరాని కొనుగోలు కేంద్రాలు



వీరనారాయణంలో కోసిన వరి చేలు

మాడుగుల : ఈ ఏడాది రబీకి సంబంధించి వరి కోతలు దాదాపు పూర్తి కావస్తున్నాయి. వారం రోజుల నుండి కురుస్తున్న వర్షాలకు వరి పనలు తడిసిపోతున్నాయి. వరి కోతలు ప్రారంభం అయిన నాటి నుంచి వర్షపు జల్లుల వల్ల పంటలు నష్టపోతున్నారు. మండలంలో రెండు రోజులు నుంచి కురుస్తున్న వర్షాలకు సుమారు 10 ఎకరాలు కోసిన వరి చేలు తడిసిపోయాయి. ప్రభుత్వం స్పందించి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

ఎండీయూ ఆపరేటర్ల తొలగింపు అన్యాయం

మాడుగుల రూరల్ : వాహనాలు ద్వారా ఇంటింటికి పంపిణీ చేసే ఎండీయూ ఆపరేటర్లను రోడ్డు పాలు చేయడం దారుణమని, జిల్లా వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి సుంకర శ్రీనివాసరావు, కె.జె.పురం వైఎస్సార్‌సీపీ నాయకులు, కె.జె.పురం పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కాళ్ల రాము, నాయకుడు మళ్ల కన్నబాబు అన్నారు. గురువారం వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇంటింటికి రేషన్ అందించాలనే ధ్యేయంతో వాహనాల ద్వారా రేషన్ పంపిణీ చేపట్టారని, నేడు కూటమి ప్రభుత్వం అనాలోచిత విధానాల వల్ల మరో 18 మాసాలు కాల వ్యవధి ఉన్నా సరే ఆపరేటర్లను తొలగించడం అన్యాయమన్నారు. కూటమి ప్రభుత్వం అనాలోచిత విధానాల వల్ల ఆపరేటర్లు రోడ్డున్న పడ్డారని, వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



నిరుపయోగంగా వ్యవసాయ మార్కెట్ యార్డులో రైపనింగ్ కేంద్రం



మార్కెట్‌లో రసాయనాలతో మాగబెట్టిన మామిడి పండ్లు

రైపనింగ్ కేంద్రం.. నిరుపయోగం

- రూ.25 లక్షలతో ఏర్పాటు
- సహజపద్ధతుల్లో పండ్లను మాగబెట్టే సౌకర్యాలు
- రైతులకు అవగాహన కల్పించడంలో అధికారులు విఫలం
- రసాయనాలతోనే మామిడి, అరటి పండ్లను మాగబెడుతున్న వ్యాపారులు

నర్సీపట్నం : ప్రజారోగ్యానికి ఎలాంటి హాని కలగకుండా కార్బైడ్ రహిత ఫలాలను అందజేసేందుకు ప్రభుత్వం దశాబ్ధం కిందట రైపనింగ్ (మాగబెట్టు) కేంద్రాలను అందుబాటులోకి తెచ్చింది. సుమారు రూ.25 లక్షల వ్యయంతో నర్సీపట్నం వ్యవసాయ మార్కెట్ యార్డులో రైపనింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పండ్లు మాగబెట్టేందుకు ప్రత్యేక గదులు ఏర్పాటు చేశారు వ్యాపారులు, రైతులకు అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు. చివరికి అవి నిరుపయోగంగా మారాయి.

రైపనింగ్ కేంద్రం వినియోగానికి సరైన చర్యలు చేపట్టక ఎందుకు పనికి రాకుండా ఉత్సవ విగ్రహంలా దర్శనమిస్తుంది. రైపనింగ్ కేంద్రం ద్వారా మార్కెట్ యార్డుకు ఆదాయం రాకపోగా ప్రతి నెలా చెల్లిస్తున్న కరెంటు బిల్లు భారంగా మారింది. రైపనింగ్ కేంద్రం మరమ్మతులకు గురికావడంతో స్థానిక వ్యాపారులు రసాయనాలతో మాగబెట్టిన పండ్లను ప్రజలకు అంటగట్టి సొమ్ము చేసుకుంటున్నారు.

పక్వానికి రాకముందే...

ప్రస్తుతం మామిడి పండ్లు సీజన్ కావడంతో వ్యాపారులు సొమ్ము చేసుకునేందుకు కాయలు పక్వానికి రాకుండానే కాల్షియం కార్బైడ్‌తో మాగించి విక్రయిస్తున్నారు. మామిడితో పాటు అరటి గెలలను ఎథిలీన్ ద్వారా ఏసీలో గ్యాస్ వదిలి 3-4 రోజుల్లో మాగబెట్టడంతో పండ్లుగా మారుస్తున్నారు. మామిడి, అరటి పండ్లను వివిధ రసాయనాలతో మాగబెడుతున్నారు. రసాయనాన్ని నీళ్లలో కలిపి పండ్లపై స్ప్రే చేస్తున్నారు. అరటి గెలలను మిశ్రమంలో ముంచి పండ్లుగా మార్చుతున్నారు. ఏటా ఆ సీజన్‌కు తగ్గట్టు వీరు పండ్లను రసాయనాలతో మాగించి పెద్ద ఎత్తున అమ్మకాలు చేసి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రస్తుతం గాలితో పాటు అకాల వర్షాలు కురుస్తున్నాయి. మామిడి కాయలు రాలి పోతున్నాయి. వీటిని వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. మరోవైపు గాలి, వాన కారణంగా మామిడి పండ్లు పక్వానికి రాకముందే రైతులు కాయలను కోసం మార్కెట్లో విక్రయిస్తున్నారు. 20 కిలోల బాక్సును తక్కువకు కొనుగోలు చేస్తున్నారు. రైపనింగ్ కేంద్రం అందుబాటులో లేక పోవడంతో వ్యాపారులు ప్రమాదకరమైన కాల్షియం కార్బైడ్‌తో పండ్లను పక్వానికి తెప్పించి అమ్మకాలు చేస్తున్నారు.

బాగు చేయిస్తాం...

ఈ విషయమై వ్యవసాయ మార్కెట్ యార్డు సెక్రటరీని వివరణ కోరగా వినియోగంలో లేక చెడిపోయిందని తెలిపారు. రైపనింగ్ కేంద్రం ఏర్పాటు చేసిన కంపెనీ వారికి ఇటీవల ఫోటోలు తీసి పెట్టామని, కంపెనీ వారు వచ్చి బాగు చేయాల్సి ఉందని తెలిపారు. నెల నెలా కరెంటు బిల్లు చెల్లిస్తున్నామన్నారు.

భూ సమస్యపై తహసీల్దార్‌కు ఫిర్యాదు



తహసీల్దార్ లక్ష్మికి ఫిర్యాదు చేస్తున్న రైతులు

బుచ్చెయ్యపేట : మా భూములను వేరే వ్యక్తులపై రీ సర్వేలో పేర్లు నమోదు చేయడంపై బాధిత రైతులు తహసీల్దార్ లక్ష్మికి గురువారం ఫిర్యాదు చేశారు. పెదమదీన శివారు ఉప్పరగూడెంకు చెందిన నక్కా సింహాచలం, కొండమ్మలు పొట్టకూటి కోసం విశాఖ పరిసర ప్రాంతాల్లో పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరికి వారసత్వంగా వచ్చిన పెదమదీన సర్వే నెంబర్ 400-4లో సుమారు 82 సెంట్లు భూమి ఉంది. ఈ భూమిని కుటుంబ సభ్యుల ద్వారా మూడేళ్ల కిందట ఇద్దరు వ్యక్తులకు అమ్మడానికి బేరం చేసుకుని పురోణి రాసుకున్నారు. అమ్మిన వారికి రిజిస్ట్రేషన్ చేయకుండా రీ సర్వేలో తమ పేరున ఉన్న భూమిని పురోణి రాసుకున్న వారి పేర్ల మీద ఆన్‌లైన్ చేశారని, మా భూమిని మాకు తిరిగి ఆన్‌లైన్ చేసి ఆదుకోవాలని తహసీల్దార్‌కు బాధిత రైతులు వినతి పత్రం అందించారు. దీనిపై ఆన్‌లైన్ చేసుకున్న రైతులకు నోటీసులు అందించి విచారణ చేసి న్యాయం చేస్తామని తహసీల్దార్ లక్ష్మి బాధిత రైతులకు తెలిపారు.

యోగా జీవితంలో భాగం కావాలి

యలమంచిలి రూరల్: యోగా అందరి జీవితాల్లో భాగం కావాలని యలమంచిలి మున్సిపల్ కమిషనర్ బీజేఎస్ ప్రసాదరాజు అన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో యోగాంధ్ర క్యాంపెయిన్ కర్టెన్ రైజర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, ఉద్యోగులతో యోగా శిక్షకులు మళ్ల రాము, ఆదారి గంగాధర్ యోగాసనాలు అభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నెల రోజుల పాటు రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వచ్చే నెల 21 వరకు నిర్వహించనున్న కార్యక్రమాల షెడ్యూల్‌ను వివరించారు.

భక్తి శ్రద్ధలతో మరిడిమాంబ అమ్మవారి పండగ



అమ్మవారిని దర్శించుకున్న భక్తులు



గుమ్మాలపాడులో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

గొలుగొండ: కొంగసింగి గ్రామంలో మరిడిమాంబ అమ్మవారి పండగను గురువారం భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. వేకువ జాము నుంచి భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు. బంధుమిత్రుల రాకతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. ఆలయం వద్ద ప్రసాద వితరణ చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

రావికమతం: గుమ్మాలపాడు గ్రామంలో మరిడిమాంబ అమ్మవారి పండగను గురువారం ఘనంగా జరిపారు. తెల్లవారు నుంచే అమ్మవారికి భక్తులు పసుపు కుంకుమ, చీరలు,సారె పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఆర్ఎస్ఎస్ సభ్యులు మజ్జిగ పంపిణీ చేశారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

త్రైత సిద్ధాంత భవగద్గీత ప్రచారం



కె.కోటపాడులో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రతులను అందిస్తున్న సమితి సభ్యులు

కె.కోటపాడు : త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథాల కోసం ప్రజలకు వివరించి వారి జీవితంలో జ్ఞాన మార్గం అనుసరించాలని కోరే కార్యక్రమాన్ని ప్రచారం ద్వారా చేస్తున్నట్టు త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక విజయరాంపురం కమిటీ అధ్యక్షుడు కె.త్రినాథరావు, మాధవ తెలిపారు. మండలంలో కె.కోటపాడు, ఎ.కోడూరు, వి.సంతపాలెం, వారాడ గ్రామాల్లో గురువారం త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచార కార్యక్రమాన్ని వీరు నిర్వహించారు. త్రైత సిద్ధాంత ప్రతులను ఆయా గ్రామాల్లో పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ కర్మయోగం విశిష్టత, త్రైత సిద్ధాంత జ్ఞానం తెలుసుకోవాలన్నారు. సమితి సభ్యులు జి.కృష్ణో సూరప్పడు, సురేష్, పైడన్న, సత్యం, భవానీ పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



నిరసన తెలుపుతున్న అచ్యుతాపురం శ్రామిక సంఘాల నాయకులు

అచ్యుతాపురం రూరల్ : విశాఖ స్టీల్ ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికులను యథావిధిగా విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్‌లో ఈ నెల 20 నుంచి జరుగుతున్న సమ్మెకు మద్దతుగా గురువారం అచ్యుతాపురం కూడలిలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు స్టీల్ ప్లాంట్‌ను పరిరక్షిస్తామంటూ పోరాటాల్లో పాల్గొని హామీ ఇచ్చి, అధికారం వచ్చాక స్టీల్ ప్లాంట్‌ని రక్షించకపోగా మరింత వేగంగా నిర్వీర్యం చేసే విధంగా ఉద్యోగులను, కాంట్రాక్ట్ కార్మికులను తొలగిస్తుందని ఆరోపించారు. స్టీల్ ప్లాంట్ అభివృద్ధి కోసం నిరంతరం కష్టపడి పనిచేసే కార్మికులను కార్మిక చట్టాలను ఉల్లంఘించి 4వేల మందిని తొలగించి, మరో 2600 మంది కార్మికులను తొలగించేందుకు ప్రయత్నాలు చేయడం అన్యాయమన్నారు. తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సూరంపూడి రమణ, రంగాల మాధవరావు, సనాసిరావు, శివకోటి, శివ, పూడి చందు, శీరా సంజీవరావు పాల్గొన్నారు.

శ్రీరామదూతం శిరసా నమామి

- వాడవాడలా ఘనంగా హనుమజ్జయంతి
- స్వామివారికి ప్రత్యేక పూజలు
- ఆలయాల్లో అన్నసమారాధనలు



వెన్నలపాలెంలో స్వామిని దర్శించుకుంటున్న భక్తులు



గోవాడలో ఆంజనేయస్వామికి పూజలు

నర్సీపట్నం : పట్టణంలో హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బలిఘట్టం, పెదబొడ్డేపల్లి, శివపురం, కృష్ణాపురం తదితర ప్రాంతాల్లో ఆంజనేయస్వామి ఆలయాల్లో జయంతి వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకొని హనుమాన్ విగ్రహానికి అభిషేకాలు, పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు తరలివచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేశారు.

నాతవరం : హనుమజ్జయంతి సందర్భంగా మండల వ్యాప్తంగా అంజనేయస్వామి ఆలయాల్లో తెల్లవారు నుంచే వేదపండితులతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తులకు ఉత్సవ కమిటీ సభ్యులు ఉచితంగా తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయాల వద్ద భజనలు, మహిళలతో కోలాటాలు నిర్వహించారు. మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు పైల పోతురాజు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మాజీ ఎంపీపీ పారుపల్లి లక్ష్మి, తాండవ ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ కొండబాబు, నూకాలమ్మ తల్లి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ వెంకటరమణ పాల్గొన్నారు.



కొత్తకోట గ్రామంలో అన్నసమారాధన కార్యక్రమం



నాతవరంలో ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు

కె.కోటపాడు : మండలంలోని చౌడువాడ, పాచిలవానిపాలెం, కింతాడ, సూర్రెడ్డిపాలెం, వి.సంతపాలెం, ఎ.భీమవరం గ్రామాల్లో ఆంజనేయస్వామి ఆలయాల్లో గురువారం హనుమజ్జయంతి వేడుకలు జరిపారు. స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపి, మధ్యాహ్నం ఆలయంలో భక్తులకు అన్నసమారాధన జరిపారు. పాచిలవానిపాలెం గ్రామంలో జరిగిన పూజల్లో వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, కింతాడలో సర్పంచ్ బండారు ముత్యాల నాయుడు పాల్గొన్నారు.

రావికమతం : మండలంలో రావికమతం, కొత్తకోట, దొండపూడి మేడివాడ, మత్స్యవానిపాలెం తదితర గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. మత్స్యవానిపాలెంలో పలువురు భక్తులు ఆంజనేయస్వామి మాలాధారణ చేసి దీక్షలు చేపట్టారు. స్వామి వారికి ప్రత్యేక పూజలతో పాటు రామభజనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. కొత్తకోట ఆంజనేయస్వామి గుడి వద్ద అన్నపూర్ణగ్రూప్ వారి ఆధ్వర్యంలో భారీగా అన్న సమారాధన జరిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ప్రసాదం స్వీకరించారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

చోడవరం: హనుమజ్జయంతి సందర్భంగా స్థానిక వ్యాపారవీధిలోని శ్రీ అభయాంజనేయస్వామి ఆలయంలో ఏకాదశరుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, శతసహస్ర మిఠాయి అభిషేక పూజలు చేశారు. తమలపాకులు, కుంకుమార్చనలు నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేక వాహనంపై స్వామివారి తిరువీథోత్సవం జరిపారు. ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజు పాల్గొన్నారు. పట్టణంతో పాటు మండలంలోని గంధవరం, గోవాడ, వెంకన్నపాలెం తదితర గ్రామాల్లోని రామాలయాలు, హనుమాన్ మందిరాల్లో హనుమజ్జయంతి పూజలు ఘనంగా జరిపారు.

మాడుగుల రూరల్: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని కె.జె.పురంలో అభయాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక కుంకుమ పూజలు, అభిషేకాలు, నిమ్మకాయలతో పూజలు నిర్వహించారు.



సత్యవరంలో ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న భక్తులు



కింతాడలో ఆంజనేయస్వామి ఆలయంలో పూజల్లో సర్పంచ్ ముత్యాలనాయుడు



బూరుగపాలెంలో పూజలు చేస్తున్న మాజీ ఎంపీపీ, తదితరులు

ఎం.కోడూరు, ఎం.కోటపాడు, ముకుందపురం, వంటర్లపాలెం, కింతలి, వీరవల్లి అగ్రహారంల్లోనూ ఆలయాల్లో హనుమజ్జయంతి పూజలు ఘనంగా జరిపారు. మధ్యాహ్నం ఆలయాల వద్ద అన్నసమారాధనలు జరిపారు.

మాడుగుల : స్థానిక జవ్వాగెడ్డ వద్ద అభయాంజనేయ ఆలయం వద్ద గురువారం అభయాంజనేయ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, మధ్యాహ్నం అన్న సమారాధన జరిపారు. గాదిరాయి పాల కేంద్రం వద్ద అభయాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సత్యవరం గ్రామంలో అభయాంజనేయ జయంతి పూజలు ఘనంగా నిర్వహించారు. భారీ అన్న సమారాధన నిర్వహించారు.

మాకవరపాలెం: మండలంలోని తామరం, కొండలఅగ్రహారం, లచ్చన్నపాలెం, జంగాలపల్లి, పెద్దిపాలెం, రామన్నపాలెం,జి.గంగవరం, బూరుగుపాలెం తదితర గ్రామాల్లో గురువారం హనుమాన్ జయంతిని స్థానికులు వైభవంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయాల వద్ద అన్నసమారాధనలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, బూరుగుపాలెం ఎంపీటీసీ యర్రాపాత్రుడు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దేవరాపల్లి: మండల వ్యాప్తంగా హనుమాన్ జయంతి వేడుకలు గురువారం అంగరంగ వైభవంగా జరిగాయి. మామిడిపల్లిలో జెడ్పీటీసీ కర్రి సత్యం, స్థానిక సర్పంచ్ కర్రి సూరినాయుడు, ఉప సర్పంచ్ చల్లా సుధాకర్ హనుమాన్‌ను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. పెదనందిపల్లి శివారు సత్యనారాయణపురం కాలనీలోని పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. ఆలయ ఆవరణలో మధ్యాహ్నం భారీ అన్నసమారాధనను నిర్వహించారు. ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



మామిడిపల్లిలో ఆంజనేయ స్వామిని దర్శించుకుంటున్న జెడ్పీటీసీ కర్రి సత్యం, సర్పంచ్ సూరినాయుడు



కె.జె.పురంలో వీరాంజనేయస్వామికి పూజలు



రోలుగుంట హనుమాన్ ఆలయంలో పూజలు

రోలుగుంట: మండలకేంద్రంలో గల హనుమాన్ ఆలయంలో వేడుకగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. పలువురు భక్తులు స్వామివారి మాలలు ధరించారు. కొమరవోలు. కుసుర్లపూడి .జానకీరాంపురం, జె.నాయుడుపాలెం తదితర గ్రామాల్లో హనుమజ్జయంతి పూజలు ఘనంగా జరిగాయి.

బుచ్చెయ్యపేట : మండలంలో గల పలు గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బుచ్చెయ్యపేట కొండ వద్ద ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేజర్ పంచాయితీ వడ్డాది జంక్షన్‌లో ఆంజనేయ స్వామిని ఎమ్మెల్యే రాజు నాయకులతో దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. విజయ రామరాజుపేట, రాజాం , లోపూడి, సీతయ్యపేట, దిబ్బిడి, గున్నెంపూడి, తురకలపూడి తదితర గ్రామాల్లో ఆంజనేయస్వామి ఆలయాల్లో కుంకుమ పూజలు, వ్రతాలు నిర్వహించారు. పలుఆలయాల వద్ద అన్న సమారాధనలు నిర్వహించారు.



బుచ్చెయ్యపేటలో పంచముఖ ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న నాయకులు



నాతవరంలో అన్నదానం చేస్తున్న మహిళా భజన బృందం



దొండపూడి గ్రామంలో పూజలు అందుకుంటున్న ఆంజనేయస్వామి